## హైదరాబాద్ మెట్రో వేళల్లో మార్పులు..

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలియజేశారు. ప్రస్తుతం రాత్రి 11 గంటల వరకు నడుస్తున్న మెట్రో రైలు సేవలు, ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాత్రి 11.45 గంటల వరకు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ మారిన వేళలు సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే అమల్లో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. టెర్మినల్ స్టేషన్ల నుంచి ఆదివారం మొదటి రైలు ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. మరోవైపు, 2024 ఏప్రిల్ లో ప్రారంభమైన సూపర్ సేవర్ హాలీడే ఆఫర్ మరియు ఆఫ్ పీక్ వేళల్లో స్మార్ట్ కార్డులపై ఇచ్చే తగ్గింపు మార్చి 31వ తేదీతో ముగియనుంది. ఈ ఆఫర్ ద్వారా 20 ట్రిప్పులకు డబ్బులు చెల్లించి 30 ట్రిప్పులు ప్రయాణించే అవకాశాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో, ఈ ఆఫర్‌ను మరో ఏడాది పాటు పొడిగిస్తూ హైదరాబాద్ మెట్రో నిర్ణయం తీసుకుంది.


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక


## రెండ్రోజులు ఇదేమాదిరిగా ఎండలు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. దానికితోడు ఉక్కపోత కూడా తీవ్రమైంది. ఫ్యాన్లు, కూలర్లు తిరుగుతున్నా వేడిగాలికి తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఆది, సోమవారాల్లో పరిస్థితి ఇలాగే ఉండే అవకాశముంది. అయితే, ఆ తర్వాత క్రమంగా రెండు నుంచి మూడు డిగ్రీల మేర గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. రాష్ట్రంలో శనివారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 40 డిగ్రీలకుపైగా గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయినట్టు తెలిపారు. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఏప్రిల్ రెండో తేదీన పలు జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల(గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లవేగం)తో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈదురుగాలుల వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్, కొమ్రంభీం అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది.


సంపుటి: 01 సంచిక : 178. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.30.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00


# భూకంప మృతులు 1600 మందికి పైనే!






నెపిడా, బ్యాంకాక్ :అమృత్ తెలంగాణ: మయన్మార్, థాయిలాండ్‌లలో శుక్రవారం సంభవించిన భూవిలయంలో మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. మయన్మార్‌లో ఇప్పటివరకు 1600మందికి పైగా మరణించారని మయన్మార్ మిలటరీ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, 118మంది సిబ్బందితో ఆగ్రా నుంచి ఫీల్డ్ ఆస్పత్రిని మయన్మార్‌కు భారత్ పంపించింది. ఆయా ప్రాంతాల్లో మరణించిన వారిలో భారతీయులెవరూ లేరని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. మయన్మార్‌లో మరో 3,400 మంది గాయపడ్డారనీ, 30మంది ఆచూకీ తెలియలేదని అక్కడి ప్రభుత్వం తెలిపింది. సమయం గడుస్తున్న కొద్దీ శిథిలాల నుంచి మృతదేహాలు బయటపడుతున్నాయనీ, సమాచారం సేకరిస్తున్నారనీ, ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని ప్రభుత్వం వివరించింది. మయన్మార్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధంతో అత్యవసర సర్వీసులు తీవ్రంగా బలహీనమయ్యాయి. దీంతో శక్తివంతమైన ఈ ప్రకృతి వైపరీత్యాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవటంలో ప్రభుత్వం పలు ఇబ్బందులు పడుతోంది. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో 10మంది మరణించారు. 26మంది గాయపడ్డారు. బ్యాంకాక్‌లోని చటుచక్ మార్కెట్‌కు సమీపంలో నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం కూలిన ఘటనలో దాదాపు వందమంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారని తెలుస్తోంది. భారీ భూకంపంతో భవనాలు నేలమట్టమైన పరిస్థితుల్లో తమ వారి కోసం కేవలం చేతులతోనే ఆ శిథిలాలను, రాళ్లగుట్టలను తవ్వేందుకు ప్రయత్నించడం కనిపిస్తోంది. సాయం కోసం కేకలు వేస్తున్న వారిని బయటకు లాగేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మయన్మార్‌లో శనివారం కూడా ప్రకంపనలు ఎక్కువగానే కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిల్లో ఒకదాని తీవ్రత 6.4గా నమోదైంది. మాండలె నగరంలో డజన్ల సంఖ్యలో భవనాలు కూలిపోవడంతో ఆ శిథిలాల్లో చిక్కుకున్న వారిని వెలికి తీయడానికి తమకు సాయం కావాలని సహాయక బృందాలు పేర్కొంటున్నాయి. మయన్మార్ సాంస్కృతిక రాజధాని అయిన మాండలేలో ఒక భవనం కూలిన ఘటనలో 90మందికి పైగా శిథిలాల్లో చిక్కుకుపోయారు. 12 అంతస్తుల ఈ భవనం భూకంపం ధాటికి ఆరు అంతస్తులుగా మిగిలింది. రక్తం కోసం డిమాండ్ బాగా ఉన్నదనీ, రక్త దాతలు ఉదారంగా ముందుకు రావాలని ప్రభుత్వం కోరింది. విదేశీ సాయం తీసుకోవడానికి తాము సిద్ధంగా వున్నామని మిన్ ఆంగ్ ప్రకటించారు. ఇంకా జరిగిన నష్టం, మరణాలపై ఒక స్పష్టత రావాల్సి వుందని ఎన్‌జిఓ ప్లాన్ ఇంటర్నేషనల్‌కు సంబంధించి మయన్మార్ డైరెక్టర్ హైదర్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఇంతటి విధ్వంసాన్ని తాము చూడలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మానవతా సాయం చాలా ముఖ్యమని అన్నారు.


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక

మొదటి వార్షికోత్సవ శుభాకాంక్షలు.

వినియోగదారులకు శ్రేయోభిలాషులకు

ధన్యవాదములు కృతజ్ఞతలు



వ్యవస్థాపకులు

సింగిడి అమృత్


# సిజీఎస్టీ అధికారులకు పండుగ సెలవులు లేవు



న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: రంజాన్ రోజున కేంద్ర వస్తువులు మరియు సేవల పన్ను (సిజీఎస్టీ) అధికారులను తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదన వివాదాస్పదమైంది. సిజీఎస్టీ అధికారులు, ఉద్యోగులు మార్చి 29, 30 మరియు 31 తేదీలలో తప్పనిసరిగా పనికి హాజరు కావాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు ఆదేశించింది. రంజాన్ కు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించి, ఇప్పుడు శని, ఆదివారాలు మరియు సోమవారాల్లో ఉద్యోగులు హాజరు కావాలని సూచించడం పూర్తిగా అసహజమైనది. ఆదివారం లేదా సోమవారం రంజాన్ జరుపుకుంటారు. దేశంలోని సిజీఎస్టీ కార్యాలయాల్లో ముస్లిం ఉద్యోగులు, అధికారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. సెలవు దినాన్ని పని దినంగా ప్రకటించడమే కాకుండా, ఈ రోజుల్లో ఎవరికీ 'సెలవు' ఇవ్వకూడదని కేంద్ర ప్రభుత్వం ఒక వింత సూచనను కూడా ఇచ్చింది.

తిరువనంతపురం జోన్‌లోని సిజీఎస్టీ అధికారులు, ఉద్యోగుల అభ్యర్థన మేరకు సిపిఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ సమస్యపై జోక్యం చేసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. సెలవు రోజున తప్పనిసరిగా పనికి రావాలనే ప్రతిపాదన ఉద్యోగులు తమ మతపరమైన ఆచారాలను అనుసరించే ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమేనని లేఖలో ఎత్తి చూపారు. రంజాన్ రోజున పనికి హాజరు కావాలని డిమాండ్ చేయడం పూర్తిగా అన్యాయమన్నారు. మత స్వేచ్ఛ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో ఒకటని పేర్కొన్నారు. మతపరమైన విధులు నిర్వహించడానికి ఒక రోజు సెలవు నిరాకరించడం వల్ల ఉద్యోగులు, అధికారులలో ఒక వర్గం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన సెలవుల జాబితాను కూడా ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. ప్రస్తుత ఉత్తర్వు గెజిటెడ్ సెలవులను పాటించాలని సిబ్బంది శాఖ, హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందన్నారు. ఈ ఉత్తర్వును ఉపసంహరించుకుని ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని బ్రిట్టాస్ లేఖలో డిమాండ్ చేశారు.

# నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా లింక్ రోడ్లను నిర్మించండి: సీఎం రేవంత్



హైదరాబాద్:అమృత్ తెలంగాణ: ప్రజా ప్రయోజనాల విషయంలో వ్యయానికి వెనుకాడవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా లింక్ రోడ్లను నిర్మించాలని సూచించారు. హైదరాబాద్ మున్సిపల్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోని 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల అనుసంధానం, ఆటంకాలు లేని రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అదనపు భూసేకరణ విషయంలో వ్యయానికి వెనుకాడవద్దని, ప్రజాప్రయోజనాలనే దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి పేలిన తూటా




అమృత్ తెలంగాణ: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. వారిపై తూటాలతో వేట ఆగటం లేదు. భద్రతా దళాలు అడవులను జల్లెడ పట్టి.. మావోయిస్టులను మట్టుబెడుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఛత్తీస్‌గఢ్‌లోని దట్టమైన అడవుల్లో తుపాకుల మోతలే వినబడుతున్నాయి. మావోయిస్టుల ప్రాబల్యమున్న ఈ రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. భద్రతా బలగాలతో జరుగుతున్న ఎదురు కాల్పుల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేయాలన్నదే తమ లక్ష్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవటం గమనార్హం. మావోయిస్టులకు పట్టున్న సుక్మా జిల్లాలోనూ తాజాగా భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో 17 మంది మావోయిస్టులు చనిపోయారు. నలుగురు జవాన్లకు స్వల్ప గాయాలయ్యాయి. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

రాయ్ పూర్ : ఇటీవలి కాలంలో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టుల కోసం గాలింపు జరుపుతుండగా సుక్మా పోలీస్ స్టేషన్ పరిధిలోని కెర్లాపాల్ ప్రాంతంలో వారు తారసపడ్డారనీ, ఈ సందర్భంగా ఎదురు కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ తెలిపారు. జిల్లా రిజర్వ్ గార్డులు (డీఆర్‌జీ), కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్) సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయని ఆయన చెప్పారు. 'ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు చనిపోయారు. నలుగురు జవాన్లకు స్వల్పంగా గాయాలయ్యాయి' అని అన్నారు.

మావోయిస్టుల ఏరివేతలో భద్రతా దళాలు సాధిస్తున్న విజయాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. "నక్సలిజంపై మరో దాడి జరిగింది. మన భద్రతా దళాలు మావోయిస్టులను మట్టు పెట్టాయి. సుక్మా ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ప్రధాని మోడీ నాయకత్వంలో 2026 మార్చి 31 లోగా నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మేము కృతనిశ్చయంతో ఉన్నాం" అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయుధాలు, హింసతో ఎలాంటి మార్పునూ తీసుకురాలేరనీ, కేవలం శాంతి, అభివృద్ధి మాత్రమే దానిని సాధిస్తాయని ఆయన తెలిపారు.

దట్టమైన అటవీ ప్రాంతంలో కొందరు మావోయిస్టులు సంచరిస్తున్నారని సమాచారం అందడంతో భద్రతా దళాలు శుక్రవారం రాత్రే అక్కడికి బయలు దేరాయనీ, శనివారం ఉదయం కాల్పులు మొదలయ్యాయని ఆపరేషన్‌లో పాలుపంచుకున్న ఓ అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా దళాలు అటవీ ప్రాంతంలో గాలింపు కొనసాగిస్తున్నాయి. మరి కొందరు మావోయిస్టులు కూడా ఆ ప్రాంతంలో దాక్కొని ఉండవచ్చునని అనుమానిస్తున్నాయి. మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉన్న బస్తర్ డివిజన్‌లోనే సుక్మా జిల్లా ఉంది. ఇటీవలి కాలంలో అక్కడ భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పుల ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ఈ జోన్‌ను అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా అధికారులు గుర్తించారు.

నక్సలిజంను నిర్మూలిస్తామని అమిత్ షా పదే పదే చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడం గమనార్హం. వారం రోజుల క్రితం ఆయన పార్లమెంటులో కూడా ఇదే విషయాన్ని చెప్పారు. గత పది సంవత్సరాల కాలంలో మావోయిస్టుల హింస 53 శాతం తగ్గిందని అమిత్ షా తెలిపారు.

# మెహందీ ఆర్టిస్ట్ పింకీ ఆత్మహత్య



రాజేంద్రనగర్ :అమృత్ తెలంగాణ: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మెహందీ ఆర్టిస్ట్ పింకీ శర్మ(32) ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన పింకీశర్మ మెహందీ ఆర్టిస్టుగా పని చేస్తోంది. ఏడాది కిందట అమిష్ లోయా అనే వ్యక్తిని పెండ్లి చేసుకుంది. ఇటీవల భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం మరోమారు ఇద్దరు గొడవపడ్డారు. దాంతో భర్త పింకీని ఇంట్లో ఉంచి బయట నుంచి తాళం వేసి వెళ్లిపోయాడు. ఇంట్లో ఉన్న పింకీ తీవ్ర మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పింకీ మృతికి భర్త వేధింపులు, కుటుంబ కలహాలే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# న్యాయ వ్యవస్థపై నీలి నీడలు



## ఓ న్యాయమా నీవు ఎక్కడ

అమృత్ తెలంగాణ ఇటీవల ఉన్నత న్యాయస్థానాలలో కొంతమంది న్యాయమూర్తుల వ్యవహార శైలి పెద్ద చర్చనీయాంశ మైంది. తాజాగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం జరగడం, ఆ మంటలు ఆర్పడానికి వెళ్ళిన ఫైర్ సిబ్బందికి పెద్ద ఎత్తున బస్తాలలో కాలిన కరన్సీ నోట్ల కట్టలు కనిపించడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది.

ఒక బాలికపై అత్యాచార ప్రయత్నం కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ మిశ్రా ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు ఇటీవలే తీవ్రంగా స్పందించింది. ఆయన అత్యాచారానికి ఇచ్చిన నిర్వచనం అర్థరహితమని తీవ్రమైన పదజాలంతో విమర్శిస్తూ, ఆయన ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. హైకోర్టులో ఆయన ఇచ్చిన తీర్పు ఏంటంటే పురుషుడు ఒక మహిళ ఛాతిపై చేతులు వేయడం, ఆమె పైజామా తాడు లాగడం వంటివి అత్యాచార ప్రయత్నం, లైంగిక వేధింపు కిందకు రాదని ఆయన తీర్పు. ఇంకా విచిత్రం ఏమిటంటే అది నేరమేనని క్రింది కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ నేరస్థుడు హైకోర్టుకు వెళ్లగా, అలహాబాద్ హైకోర్టు ఇటువంటి తీర్పును ఇచ్చింది. ఇటువంటి తీర్పే నాలుగేళ్ల క్రితం ముంబాయి హై కోర్టు జడ్జి జస్టిస్ పుష్ప గణేదివాలా కూడా ఇచ్చారు. ఈ జడ్జి స్వయంగా ఒక మహిళ కావడం కొస మెరుపు.

### తప్పుడు తీర్పులకు శిక్ష లేదా?

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. అదేమిటంటే ఇంత నీచమైన తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తికి శిక్ష ఏమిటని? అలాంటివారు ఆ స్థానంలో ఉండడానికి అర్హులేనాని? ఇటువంటి తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులకు చట్టం ఏం అర్థమైనట్టు, మహిళల హక్కుల గురించి ఏం అవగాహన ఉన్నట్లు, అసలు రాజ్యాంగం పట్ల ఏమైనా గౌరవం ఉందా అనే సందేహాలు కలుగుతాయి. ఇటువంటి తీర్పుపై సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, స్టే ఇవ్వడం వరకు బాగానే ఉంది. కానీ, అటువంటి న్యాయమూర్తిపై ఏ చర్య తీసుకున్నారు అన్నది ప్రశ్న. ఏ చర్యా తీసుకోకపోతే ఇటువంటి తీర్పులు ఇంకా వస్తూనే ఉంటాయి.

### బిల్కిస్ బానో..

బిల్కిస్ బానో అనే గర్భిణీ స్త్రీపై 2002 గుజరాత్ మారణ కాండలో సామూహిక అత్యాచారం జరిగింది. అంతేకాకుండా ఆమె కుటుంబంలోని 14 మంది హత్యకు గురయ్యారు. 2008లో ప్రత్యేక సిబిఐ కోర్టు 11 మంది పురుషులకు జీవిత ఖైదు విధించింది. ఆగస్టు 2022లో ఈ 11 మంది దోషులను గుజరాత్ ప్రభుత్వం ఉపశమన విధానం కింద విడుదల చేసింది. ఇది ప్రజల ఆగ్రహానికి దారితీసింది. మార్చి 2024లో, సుప్రీంకోర్టు వారి ఉపశమనాన్ని రద్దు చేసి, వారిని తిరిగి జైలుకు పంపాలని ఆదేశించింది.

### ఇక్కడ తప్పుడు తీర్పు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తులకు శిక్ష ఏది?

సాధారణ ఉద్యోగి తప్పు చేస్తే శిక్ష కఠినంగా ఉంటుంది. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు కొన్ని జీవితాలను, కుటుంబాలను జీవితాంతం ప్రభావితం చేస్తాయి. అలాంటప్పుడు పదేపదే తప్పుడు తీర్పులకు కఠినమైన శిక్ష లేకపోతే ఎలా?

### జవాబుదారీతనం..

న్యాయస్థానాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నా పూర్తిగా జవాబుదారీతనం కూడా ఉండాలి. తమకు ఇష్టం వచ్చినట్లు తీర్పులు ఇస్తూ పోతామని అనుకుంటే అది పొరపాటే అని స్పష్టంగా తెలియాలి. ప్రజాస్వామ్య భారతదేశంలో అన్ని వ్యవస్థలు అంతిమంగా ప్రజలకు జవాబుదారీగానే ఉండాలి. దేనికి అదే స్వతంత్రంగా పనిచేసినా, అన్నీ అంతిమంగా రాజ్యాంగానికి లోబడే ఉండాలి. ఆ రాజ్యాంగం ప్రజలచే రూపొందించబడింది. కాబట్టి ప్రజలకు అన్ని వ్యవస్థలు జవాబుదారీగానే ఉండాలి. ఇందులో న్యాయ వ్యవస్థకు మినహాయింపేమీ లేదు.

అలాగే నేడు అవినీతి, లంచగొండితనం, బంధుప్రీతి, వనరుల దోపిడీ వంటివి సమాజంలో విశృంఖలంగా చెలరేగుతున్న సమయంలో న్యాయ వ్యవస్థ అన్ని వేళలా వీటికి అతీతంగా ఉంటుందని భావించలేం. ఇది కూడా రాజ్యాంగ యంత్రంలో భాగమే కదా. అందువల్ల ఎప్పటికప్పుడు సరి చేసుకుంటూ, కుళ్ళును నిర్మూలించే చర్యలు చేపట్టకపోతే, కొన్నాళ్ళకు మొత్తంగానే కుళ్లిపోతుంది. మన న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే గొప్పదిగా పేరుగాంచింది. అనేక మంచి తీర్పులు ఇచ్చి, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాపాడిన చరిత్ర దీనికుంది. ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకోవాలి.

### దొంగ డబ్బు..

న్యాయమూర్తి ఇంట్లో నగదుపై సుప్రీంకోర్టు అంతర్గత విచారణకు ఆదేశించింది. అలాగే పార్లమెంటులో కూడా చర్చ జరిగింది. దేశ ప్రజలను ఈ ఘటన ఆశ్చర్యపరిచింది. వర్మ తన ఇంట్లో దొరికిన డబ్బులతో తనకి ఏమీ సంబంధం లేదని తెలుపుతున్నారు. ఏమీ సంబంధం లేకపోతే ఆయన ఇంట్లోకి పెద్ద మొత్తంలో నోట్ల కట్టలు ఎక్కడి నుంచి వచ్చాయి అన్నదే పెద్ద ప్రశ్న. ఒక న్యాయమూర్తి ఇంట్లోకి ఇతరుల చొరబడే అంత లోపభూయిష్టంగా మన భద్రతా వ్యవస్థ ఉందా అన్న సందేహం కూడా కలుగుతుంది.

### సుప్రీం ప్రధాన న్యాయమూర్తి..

ఇంతకుముందు కూడా న్యాయమూర్తులపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఏకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మీదనే ఆయన వద్ద పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగి వేధింపులకు చికిత్స చేసినట్లు కంప్లైంట్ ఇచ్చింది. అయితే ఏ చర్య తీసుకోలేదు. ఇంకా విశేషమేమిటంటే బాబ్రీ మసీదు కేసు వెలువడిన తరువాత, ఆ కేసులో బిజెపి నాయకులందరూ నిర్దోషులేనని తీర్పు వచ్చిన తరువాత, సాంప్రదాయాలకు భిన్నంగా, పదవీ విరమణ చేసిన కొద్ది కాలానికే రాజ్యసభ సీటు ఇచ్చి అధికార పార్టీ ప్రధాన న్యాయమూర్తిని సత్కరించింది కూడా. తీర్పు నిష్పాక్షికతను ఇలాంటివి ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

### సన్నగిల్లుతున్న విశ్వసనీయత..

ఇలాంటివి చాలా ఉన్నాయి. చేస్తున్న చర్యలు కూడా న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని సన్నగిల్లేలా ఉన్నాయి. ఉదాహరణకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి వర్మను ఈ ఉదంతం తరువాత మాతృ కోర్టు అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. అక్కడ బార్ అసోసియేషన్ దీన్ని తీవ్రంగా ఖండించడమే కాక విధులను కూడా బహిష్కరిస్తున్నట్లుగా చూపించారు. ఇలాంటి వారందరినీ బదిలీ చేయడానికి అలహాబాద్ హైకోర్టు ఏమైనా చెత్త కుప్పా? అని చాలా పరుష పదజాలంతో స్పందించింది. దీనికి న్యాయ వ్యవస్థ సిగ్గుపడాలి.

### కేంద్ర మోదీ ప్రభుత్వ కుట్రలు..

నందట్లో నడేమియాలా పార్లమెంటులో చర్చ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన అసలు స్వరూపాన్ని మరోసారి బయట పెట్టకుంది. సుప్రీంకోర్టుతో సహా అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న మోదీ ప్రభుత్వానికి న్యాయమూర్తులపై వస్తున్న ఆరోపణలన్నీ అవకాశంగా దొరికాయి. అందువల్ల గత పదేళ్లుగా తీవ్రంగా ప్రయత్నం చేయడం సాధ్యం కానటువంటి ఒక బృహత్తరది ఇప్పుడు మళ్లీ తెర మీదకు తీసుకువచ్చింది. అదేమిటంటే కొలీజియం వ్యవస్థ రద్దు. సుప్రీంకోర్టు, హైకోర్టులలో న్యాయమూర్తుల నియామకం, బదిలీలు, ప్రమోషన్లు చూడడానికి ప్రభుత్వం జోక్యం లేకుండా న్యాయమూర్తులతో కూడిన ఒక కొలీజియం వ్యవస్థ ఉంది. ఇది న్యాయవ్యవస్థపై పూర్తి పట్టు సాధించడానికి, తనకు అనుకూలమైన న్యాయమూర్తులను నియమించడానికి, బదిలీలు వారికి మోడీ ప్రభుత్వానికి ఆటంకకరంగా నిలబడింది. అందుకే దీనిని ఎలాగైనా మార్చాలని 2014లో అవెరికాలోనే మొట్టమొదటిసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంటులో NJAC (National Judicial Appointments Commission)చట్టం 2014లో తెచ్చింది. అయితే ఇది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఆ చట్టాన్ని 2015లో కొట్టివేసింది. ప్రస్తుతం మళ్లీ తన పట్టు బిగించడానికి మోదీ ప్రభుత్వానికి అవకాశం వచ్చింది. అదే కానీ జరిగితే న్యాయ వ్యవస్థకున్న ఈ మాత్రం జవాబుదారీతనం కానీ, విశ్వసనీయత కానీ ఇక నిలబడదు. ఇప్పటికే ఎన్నికల కమిషన్, దర్యాప్తు సంస్థలను తన గుప్పెట్లో పెట్టుకున్న మోదీ ప్రభుత్వం, న్యాయ వ్యవస్థను కూడా కబళిస్తే ఇక పూర్తిగా నియంతృత్వం వైపే దారి తీస్తుంది. దీన్ని ఎట్టి పరిస్థితులను నిలబెట్టవలసిన అవసరం ఉంది. న్యాయ వ్యవస్థ స్వతంత్రతని నిలుపుకోవడం ప్రజాస్వామ్యానికి అత్యవసరం. అదే సందర్భంలో పూర్తి పట్టుకై అర్రులు జాస్తున్న మోదీ ప్రభుత్వ దుశ్చర్యలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య మనుగడకు అవసరం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే బాధ్యత, రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత ప్రజలదే అనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో దేశ ప్రజలందరూ స్పందించవలసిన అవసరం ఉంది. అదే సందర్భంలో లోపాలను కూడా సరిచేసుకోవాలి. అయితే ప్రస్తుతం భారత న్యాయవ్యవస్థ సమర్థవంతంగా న్యాయం అందించే అడ్డుకునే అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది.

### న్యాయంలో జాప్యం..

తీర్పులలో తీవ్ర జాప్యం అనేది అత్యంత ముఖ్యమైన సమస్యలలో ఒకటి. వివిధ కోర్టులలో భారీ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అందుబాటులో ఉన్న తాజా డేటా ప్రకారం కోర్టులలో సుమారు 2.84 కోట్ల కేసులు, హైకోర్టులలో 43 లక్షలు, సుప్రీంకోర్టులో 57,987 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సుప్రీం కోర్టులో 1986 నాటి ఒక కేసు 39 సంవత్సరాలైనా ఇంకా పెండింగులోనే ఉంది. కేసులు నడుస్తుండగానే కక్షిదారులు చనిపోతున్న సందర్భాలేకం. కోర్టుల కెళితే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రజలకు లేదు. ఎవరినైనా ఇబ్బంది పెట్టాలంటే కోర్టులో కేసు వేస్తానని బెదిరించడం ఒక రివాజుగా మారింది. 'Justice delayed is Justice rejected అన్నది నేడు సాధారణం అయిపోయింది. దీర్ఘకాలం కేసుల పెండింగుకు న్యాయమూర్తులు, సిబ్బంది, మౌలిక వసతుల కొరత ప్రధాన కారణాలు.

### తక్కువ న్యాయమూర్తులు - ప్రజల నిష్పత్తి..

భారతదేశంలో ప్రతి 48,000 మందికి ఒక న్యాయమూర్తి ఉన్నారు. పనిభారం అమెరికా కంటే సుమారు ఆరు రెట్లు ఎక్కువ. హై కోర్టు, క్రింది కోర్టులలో దాదాపు 30 శాతం జడ్జీల పోస్టుల ఖాళీలు ఉన్నాయి. వీటిని భర్తీ చేయడానికి సుప్రీం కోర్టు ఎన్ని విజ్ఞప్తులు చేసినా, ప్రభుత్వాల నుండి సరైన స్పందన కరువైంది.

### పారదర్శకత లేకపోవడం..

న్యాయవ్యవస్థ పనితీరు, నిర్ణయం తీసుకునే ప్రక్రియలలో పారదర్శకత లేకపోవడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. న్యాయమూర్తులను నియమించే ప్రక్రియ తరచుగా నెమ్మదిగా, వివాదస్పదంగా ఉంటోంది.

### సరిపోని ప్రాథమిక సౌకర్యాలు..

భారతదేశంలోని అనేక కోర్టులలో సాంకేతికతతో సహా ఆధునిక సౌకర్యాలు లేవు. ఇది కేసుల సమర్థవంతమైన పరిష్కారానికి ఆటంకం కలిగిస్తోంది. కొన్ని కోర్టులలో కనీస మౌలిక వసతులు కూడా లేవు. కక్షిదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### అవినీతి..

న్యాయవ్యవస్థలోని అవినీతి విశ్వసనీయత, ప్రభావం దెబ్బతీస్తోంది. నిప్పుకు చెద పట్టడం అంటే ఇదే. ఈ సవాళ్లను సర్దుబాటు చేయడం, న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం, కోర్టులలో మౌలిక సదుపాయాలను అందించడం, స్వతంత్రతను కాపాడుతూనే న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం వంటి సమగ్ర సంస్కరణల అవసరం ఉంది. ఎ అజ శర్మ ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక



అమృత్ తెలంగాణ బ్యూరో
సీనియర్ రిపోర్టర్ కేఎల్ రాములు,

# డాక్టర్ చంద్రిక అవినాష్ కు రాష్ట్రస్థాయి ఎక్సలెన్స్ అవార్డు,.... ఆనందం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు



అవార్డు అందుకున్న డాక్టర్ చంద్రిక అవినాష్,

నిర్మల్ జిల్లా మార్చ్ 29 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో గల ప్రముఖ దేవిబాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కూ చెందిన డాక్టర్ చంద్రిక అవినాష్, వారు ప్రజలకు అందిస్తున్న సేవలకు రాష్ట్ర స్థాయిలో డాక్టర్స్ ఎక్సెలెన్స్ అవార్డు గైనకాలజీ మరియు ఇన్ఫర్టిలిటీ విభాగంలో ఎంపీ .రఘునందన్ రావు మరియు రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు తనకు రావడం చాలా సంతోషంగా ఉందని తనపై మరింత బాధ్యత పెరిగిందని తనని నిరంతరం ఆదరిస్తున్న తన అభిమానులకు పేషెంట్లకు మరియు నిర్మల్ జిల్లా ప్రజలకు హాస్పిటల్ సిబ్బందికి డాక్టర్ అవార్డు వచ్చిన సందర్భంగా సంతోషంతో ధన్యవాదాలు తెలిపారు

# ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగేష్‌ను అభినందించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ మంగేష్ ను అభినందించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,న్యాయవాది అయిన మంగేశ్ దేవతాడే ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నివాసంలో వారికి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మంగేష్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలియ జేయడం జరిగింది. కార్యక్రమంలో మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్ రెడ్డి, సంజయ్ గౌలె తదితరులు పాల్గొన్నారు.



అదిలాబాద్ బార్ అసోసియేషన్ నూతన జాయింట్ సెక్రెటరీగా మంగేష్ ను శాలువతో అభినందిస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

# తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : హైదరాబాద్ లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఏప్రిల్ 1 వ తేదీన గాంధీ భవన్ లో ఉదయం 10 గంటలకు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ స్టేట్ కమిటీ సభ్యులు మరియు జిల్లా అధ్యక్షుల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతున్నట్లు వివరించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర విత్తభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మరియు నేషనల్ కిసాన్ కాంగ్రెస్ వైస్ - ప్రెసిడెంట్ శ్రీ అఖిలేష్ శుక్ల ముఖ్య అతిధులుగా పాల్గొననున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించడం జరిగింది. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ప్రచార కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ప్రచార వ్యూహాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సంబంధించి ప్రస్తుత పరిస్థితులు, వారి సంక్షేమానికి అవసరమైన కార్యాచరణ పథకాలు, కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసే విధానాల గురించి సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. త్వరలో జిల్లావారీగా రైతు సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. సమావేశంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఆదిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , కిసాన్ కాంగ్రెస్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

# మా అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూసార పరీక్ష క్యాంపు బోసి గ్రామంలో ఏర్పాటు



భూసార పరీక్షల క్యాంపుకు హాజరైన రైతులు



అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూసార పరీక్షల క్యాంపు నిర్వహించిన దృశ్యం

అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా బోసి మార్చి 29 .ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక సహాయంతో కేవలం 5 నిమిషాల్లో భూసార పరీక్ష చేసే విధానాన్ని అగ్రి ఫాబ్రిక్స్ సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది .. సంస్థ కో ఫౌండర్ మరియు డైరెక్టర్ మెండు శ్రీనివాసులు ప్రారంభించారు , నేలలో నత్రజని భాస్వరం పోటాష్ తో పాటు నేల ఉదజని సూచిక , నేలలో సేంద్రియ కర్బన శాతం మరియు ఈసీ మొదలగు విషయాలు కేవలం 5 నిమిషాల్లో రైతులకు అతి తక్కువ ఖర్చులో తెలియజేయడం జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అవసరమైన ఎరువులను మాత్రమే భూమిలో వేయాలని దీనివల్ల నేలలు సారవంతం అవ్వడమే కాకుండా రైతులు తమ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలియజేస్తూ భూసార పరీక్ష కేంద్ర ఏర్పాటుకు ముందుకొచ్చిన ఆంజనేయులు గారిని సంస్థ డైరెక్టర్ మెండు శ్రీనివాస్ గారు అభినందించారు ,AEO లు శ్రీ అశోక్ కుమార్,శ్రీ విష్ణుదాస్ , సంస్థ టెక్నికల్ అధికారి శ్రీమతి కవిత, పరిమల్ రాజ్ మరియు రైతులు పాల్గొన్నారు

# ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు జీ విఠల్ రెడ్డి, నారాయణ రావు పటేల్, .




ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు విట్టల్ రెడ్డి, నారాయణరావు పటేల్,



ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు

నిర్మల్ జిల్లా భైంసా మార్చ్ 29 అమృత్ తెలంగాణ భైంసా పట్టణంలో శనివారం దవత్ ఇఫ్తార్ విందు అశోక్ బాబా నగర్, లోని నూర్ మజీద్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్, మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ కార్యక్రమం లో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు, వైస్ చైర్మన్ ఎండీ ఫరూక్ అహ్మద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మురళి గౌడ్,నిర్మల్ జిల్లా యూత్ ఉప అధ్యక్షులు నుమన్, శంకర్ చెంద్రే . ముత్యం రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, గోవింద్ పటేల్ ముధోల్ తాలూకా యూత్ ఉప అధ్యక్షులు గోవర్ధన్ ధన మరియు శరత్, ముస్లిం పెద్దలు నాయకులూ తదితరులు పాల్గొన్నారు .

# బైకుపై మృతదేహంతో నిరసన



కొయ్యలగూడెంఅమృత్ తెలంగాణ: ప్రతినిధి: కొయ్యలగూడెం మండలం ఎర్రంపేటకు చెందిన దార్ల హేమ దుర్గా ప్రసన్నను (31) గంగన్నగూడెం గ్రామానికి చెందిన మోదుగ సాయి బలవంతంగా లోపర్చుకొని ఆమెతో ఏకాంతంగా ఉన్న వీడియోలను ఫోటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులకు పాల్పడ్డాడు అనంతరం చనిపోదామని నిర్ణయించుకొని ఆమెకు పురుగుల మందు పట్టించాడు. మరొసారి పురుగుల మందు పట్టించగా ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది దీంతో మహిళా మృతదేహాన్ని సాయి ఇంటికి బైకుపై తీసుకెళ్లారు

# పాస్టర్ ప్రవీణ్ పగడాల ని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ర్యాలీ




కొయ్యలగూడెం అమృత్ తెలంగాణ: ప్రతినిధి కొయ్యలగూడెం టౌన్ లో పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మశాంతి కోసం ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో టీఎన్ స్నేహన్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణం హత్య అని పోస్ట్ మార్టం రిపోర్ట్ తేలిన వెంటనే దోషులగా ఉన్న వారికి కఠినంగా శిక్షించాలని పగడాల ప్రవీణ్ కి వారి కుటుంబానికి న్యాయం జరగాలని క్రైస్తవులు అందరూ మరియు పాస్టర్స్ అందరూకలసి పోరాడతామని హెచ్చరిస్తమన్నారు. అదేవిధంగా పాస్టర్ జాన్ విక్టర్ మాట్లాడుతూ ఈ రోజు నుంచి చర్చ్ లామీదగాని పాస్టర్స్ మరియు వారి కుటుంబాల మీద గాని దౌర్జన్యలు జరిగితే ఆ భాధ్యత రాష్ట్రా ప్రభుత్యమే భాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయిలో ఉన్న పాస్టర్స్ అందరూ ప్రవీణ్ పగడాల వారి ఆత్మకు శాంతి కలగాలని దోషులకు శిక్ష పడాలని. న్యాయం గెలవాలని ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జె ఏ సి ప్రెసిడెంట్ బొగ్గవరపు. బాబూరావు. దైవా సన్నిధి చర్చ్ పాస్టర్ పాలన్న. పాస్టర్ జీవన్. బెంజిమెన్. పాస్టర్ ఎలీషా. పాస్టర్. రాజేశ్వరరావు. రాజవరం గ్రామం సర్పంచ్. ఏలేటి చిన్న తుక్కయ. తదితరులు పాల్గొన్నారు.

# పెనుగొండ భాష్యం పాఠశాలలో "ఉగాది" పండుగ సంబరాలు





అమృత్ తెలంగాణ:పశ్చిమగోదావరి జిల్లా: పెనుగొండ: మార్చి 29: భాష్యం పాఠశాలలో తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది పండుగవేడుకలనుసాంప్రదాయబద్ధంగా ఎంతో వైభవంగా విద్యార్థులు వారి ఉపాధ్యాయులతో కలసి జరుపుకున్నారని ప్రిన్సిపల్ ఎన్ వి అప్పారావుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులంతా సాంప్రదాయవస్త్రధారణలో పండుగ వాతావరణం ప్రదర్శిస్తూ ఆడి- పాడి, పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి-అందుకు అవసరమగుమామిడికాయ వేపపూత మొదలగు వాటిని చిన్నారుల సరదాగా సేకరించడం, ప్రత్యేక పూజలను నిర్వహించి ఉగాది పచ్చడి అందరూ ఆరగించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ ఎన్ వి అప్పారావు మాట్లాడుతూ పూర్వం సోమకుడనే రాక్షసుడు బ్రహ్మ నిద్రిస్తున్న సమయంలో వేదాలను దొంగిలించడం, వాటిని తిరిగి తేవడానికి శ్రీహరి మత్స్యావతారం ఎత్తి సోమకున్ని సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అందజేశాడు. అప్పుడే బ్రహ్మ "చైత్రమాసే జగద్బ్రహ్మ ససర్జ ప్రధమే.." అంటూ చైత్రమాసంలో తొలిరోజైనా శుద్ధ పాడ్యమినాడు సకల జగత్తును సృష్టించారని, అదే యుగానికి ఆది యుగాది... కార్యక్రమంలో ఉగాదిగాజరుపుకుంటున్నామని ఉగాది పర్వదిన ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఉగాది పచ్చడిలోని షడ్రుచుల వలె ప్రతి ఒక్కరూ జీవితంలోని కష్టం సుఖం దుఃఖం ఆనందం విచారం వంటి వాటిని ఆస్వాదిస్తూ జీవితంలో సఫలీకృతులు కావాలని, ఈ నూతన సంవత్సరం విశ్వావసు అందరికీ శుభాలని పంచుతూ మేలు చేకూర్చాలని కోరుకుంటూ అందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వెస్ట్ జోన్ ఇంచార్జ్ఏ శ్రీమన్నారాయణ రెడ్డి చాంప్స్ ఇంచార్జ్ శ్రీమతి రాణి రోజాజీ ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బొరగం శ్రీనివాసులు



పోలవరం/బుట్టాయగూడెం/మార్చి 29, అమృత్ తెలంగాణ: మండలం లోని కండ్రిక గూడెం, బుట్టాయగూడెం, రెడ్డి గణపవరం, దొరమామిడి, కోయరాజమండ్రి, మంగయ్యపాలెం, అంతర్వేది గూడెం మరియు పలు గ్రామాలలో జరిగిన తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పోలవరం నియోజకవర్గం శ్రీనివాసులు కండ్రిక గూడెం బుట్టాయగూడెం గ్రామాలలో పాల్గొన్నారు బొరగం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు అన్న నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల ఆరాధ్యదైవం పార్టీ స్థాపించిన తరువాత బడుగు బలహీన వర్గాల కోసం స్థాపించిన పార్టీ అని తెలుగు జాతి ఆత్మగౌరవ పునరుద్ధరణకే తన జీవితము అంకితమని అన్న నందమూరి తారకరామారావు స్థాపించిన పార్టీని నారా చంద్రబాబు నాయుడు మహా వృక్షం విస్తరింప చేశారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండలం పార్టీ అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, గద్దె అబ్బులు, మనెల్లి బాలు, దెయ్యాల. కృష్ణమోహన్, బడిశా ముత్యాలరావు, మొడియం సింగరాజు పాయం.అరుణ్, మడకం రామకృష్ణ, బొబ్బర ఎలీషా, చిలకమూడి సుధాకర్, నల్లూరి కృష్ణమోహన్, కలగర రాము, కుందుల శ్రీను, పసుమర్తి భీమేశ్వరరావు, మందపాటి మోజేష్, మాటూరు ముసలయ్య, వరకా కృష్ణంరాజు, మాణికుల శ్రీను, పైదా వసంతరావు, సుంకర వెంకట్రావు, ముమ్మిడివరపు రమణ పుసులూరి అచ్యుతరావు, గన్నిన సూరి చంద్రం, గండ్రల జాన్, గన్నిన సత్యనారాయణ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

# మడకం లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం



పోలవరం/మార్చి 29, అమృత్ తెలంగాణ: : ఈ రోజు తెలుగుదేశంపార్టీ 43 వ ఆవిర్బవ దినోత్సవం సందర్భంగా పోలవరం పట్టణం లో సినియర్ టీడీపీ మహిళా నాయకురాలు మడకం లక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టీడీపీ పసుపు జెండా ఎగరేశారు. ఈ కార్యక్రమం లో తెలుగింటి ఆడపడుచు లు పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో మడకం లక్ష్మి మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ వచ్చాకే మనం అభివృద్ధి చెందామని సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అంటూ అన్న నందమూరి తారక రామారావు గారు ప్రజల్ని చైతన్య వంతులు చేసిన మానవ రూపం లో వున్న దేవుడు అన్నారు.జై చంద్రబాబు.. జై తెలుగు దేశం. జోహార్ అన్న ఎన్టీఆర్.అంటూ నినాదలు చేసిన ఆడపడుచులు.

# తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు - మైలా వెంకటరామరాజు

## తెలుగుదేశం పార్టీ పేదల పక్ష పార్టీ

## చేబ్రోలు లో ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





అమృత్ తెలంగాణ: చేబ్రోలు:గుంటూరు జిల్లా చేబ్రోలు మండల పరిధిలోని చేబ్రోలు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ చేబ్రోలు మండల అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణకార్యక్రమంఘనంగానిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు మాట్లాడుతూ నందమూరి తారకరామారావు స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు అని సమాజమే దేవాలయం అని ప్రజలే దేవుళ్ళు అంటు ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దింది నందమూరి తారక రామారావు అని కొనియాడారు ఎప్పుడు కూడా తెలుగుదేశం పార్టీ పేదల పక్ష పార్టీ అని నిరుపేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా రాష్ట్రం అభివృద్ధి బాటలో నడిపేందుకు నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అదేవిధంగా పొన్నూరు నియోజవర్గాన్ని కూడా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అభివృద్ధి బాటలో నడిపించటం జరుగుతుందని తెలిపారు.మండల పరిధిలోని శేకూరు, శలపాడు, వేజండ్ల, నారాకోడూరు, గొడవర్రు, మంచాల, శ్రీరంగపురం గ్రామాలలో నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా, మండల, గ్రామ, స్థాయి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీదేవి ముత్యాలమ్మ అమ్మవారి జాతర



అమృత్ తెలంగాణ: (కూనవరం) అల్లూరి సీతారామరాజు జిల్లా పల్లూరు మర్రిగూడెం గ్రామం కూనవరం మండలం స్వస్తిశ్రీ చాంద్రమానేనశ్రీ విశ్వ వసు నామ సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి ఆదివారం మార్చి 30 ఉగాది పర్వదినము సందర్భంగా మర్రిగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఘనంగా కుంకుమ పూజలు అర్చనలు మరియు గోత్రనామాలతో పూజలు గరిగలతో జాతర అత్యంత ఘనంగా నిర్వహించబడునని జాతర సమయంలో భక్తులకు మంచినీటి ప్యాకెట్స్ ఉచితంగా అందజేయబడునని దాతలు కీర్తిశేషులు కర్నాటి రాములు కీర్తిశేషులు అన్నపూర్ణమ్మ గార్ల జ్ఞాపకార్థం వారి కుమారులు కర్నాటి రామాంజనేయ దంపతులు కర్నాటి లక్ష్మణస్వామి దంపతులచే అందజేయబడునని అమ్మవారికి పూజలు మరియు మేలతాలాలతో భాజ భజంత్రీలతో అంగరంగ వైభవంగా మిరుమిట్లు కొలిపే విద్యుత్ కాంతుల నడుమ శ్రీదేవి ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించబడును అని ఆలయ కమిటీ అధ్యక్షులు బొడ్డు వెంకట్ వెల్లడించారు

# ఆర్టీసీ కండక్టర్ షేక్ రహీం సాహెబ్ కు ఘనంగా సత్కారం





అమృత్ తెలంగాణ: పొన్నూరు: నెల్లూరు జిల్లా వెంకటాచలం టోల్ గేట్ దగ్గర గల ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం,నెల్లూరు నందు విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నత విద్యా శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన విశ్వావసు నామ సంవత్సరం ద్వి శతాధిక జాతీయ ఉగాది కవి సమ్మేళనం తెలుగు సాహితీ కవుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది ఈ కవి సమ్మేళనం లో పొన్నూరు పట్టణానికి చెందిన కవి గాయకుడు ఆర్టీసీ కండక్టర్ షేక్ రహీమ్ సాహెబ్ "ఉగాది పర్వదినం"అనే కవితా గానం చేసి సభికులను అలరింపజేసారు తదనంతరం జరిగిన సత్కార కార్యక్రమంలో నెల్లూరు జిల్లా శాసన సభ్యులు మాజీ మంత్రి వర్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేతుల మీదుగా షేక్ రహీం సాహెబ్ చిరు సత్కారం పొందారు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, స్నేహ కిరణం అధ్యక్షులు వేణు,తెలుగు ఉపాధ్యాయుడు బాల సుందర్ కుమార్,వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాహితీ కవులు కళాకారులు అభినందనలు తెలియజేశారు.తెలుగు సాహిత్యంలో తమ అక్షర రూపం కవి హృదయమై తన రచనలు ఆలాపన గీతం పాడే అవకాశం ఒక గొప్ప వరం అని షేక్ రహీమ్ సాహెబ్ తమ ఆనందం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూ ప్రవృత్తి గా తెలుగు సాహిత్యంలో తమ అక్షర రూపం మున్ముందు ఎన్నో ఎన్నెన్నో సాహితీ పురస్కారాలు అందుకోవాలని మాడ భూషి సంపత్ కుమార్ కొనియాడారు.

# పట్టణ సమస్యలపై దృష్టి సారించండి




అమలాపురం అమృత్ తెలంగాణ: మార్చి 29: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణ మూర్తి అమలాపురం పట్టణ మున్సిపాలిటీ కి బదిలీ పై వచ్చిన పట్టణ మున్సిపల్ మేనేజర్ హరిక తారకనాథ్ కలిసి సభ్యులు అభినందించారు,పట్టణంలో త్రాగునీటిపై ప్రత్యేక శ్రద్ధను వహించాలని, పట్నంలో దోమలు బెడదను నివారించాలని,పట్టణ ట్రాఫిక్ సమస్య పై దృష్టి సరించాలని, తదితరసమస్య లపై మేనేజర్ని కోరారు. ఈ కార్యక్రమం లో గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు,, పితాని బేబీరావు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం...



సఖినేటిపల్లిఅమృత్ తెలంగాణ: మార్చి 29: డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి పాలెంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో 4 రోజుల పాటు ఉగాది ఉత్సవాలు వైభవం నిర్వహిస్తారు. గ్రామోత్సవం పూర్తై అమ్మవారు ఆలయం నకు చేరుకొనిదని తెలియజేసారు. రేపు ఉదయం నుండి అమ్మవారి దర్శనం ఇస్తారని, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారని, కమిటీ చైర్మన్ దంతులూరి సత్యనారాయణ రాజు (శ్రీనురాజు), సభ్యులు మురళి, బాబీ, సత్య, శ్రీను, నాయుడు కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

# పెనుగొండ అభివృద్ధికి కృషి



అమృత్ తెలంగాణ:పశ్చిమగోదావరి జిల్లా: పెనుగొండ :మార్చి 29: పెనుగొండలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామానికి సంబందించిన అభివృద్ధి ప్రణాళికను సభముకంగా తెలియచేసారు. పెనుగొండలో ఇంజినీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే క్యాన్సర్ కు సంబంధించి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఏర్పాటు చేస్తామనీ, గుండెకు సంబంధించిన వైద్యులు, పరీక్షలుఅందుబాటులో తీసుకొస్తామన్నారు.

# వైసిపి నాయకుల నుంచి ప్రాణహాని ఉంది : సునీల్ యాదవ్

పులివెందుల టౌన్ (కడప) :అమృత్ తెలంగాణ: వైసీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి కేసులో ఏ 2 గా ఉన్న సునీల్ యాదవ్ ఆరోపించారు. శనివారం స్థానిక వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సునీల్ యాదవ్ మాట్లాడుతూ హత్య సినిమాపై పోలీసులను ఆశ్రయించడంలో తప్పేముందని, తన దగ్గర కోట్ల రూపాయలు ఉంటే అద్దె ఇంట్లో ఉండాల్సిన అవసరం ఏముందని, వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. హత్య సినిమాలో తనను, తన తల్లిని కించపరిచే విధంగా చూపించడం జరిగిందని, అంతేకాకుండా సినిమాలో నలుగురిని మాత్రమే చూపించారని, మరో నలుగురైన ఉదయ్ కుమార్ రెడ్డి, వైయస్ భాస్కర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి లను ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతున్న తెలుగుదేశం పార్టీ: కొల్లు ఫౌండేషన్ చైర్మన్ కొల్లు నీలిమ

కృష్ణా అమృత్ తెలంగాణ:సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో ఎన్ టి రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 42 సంవత్సరాలు పూర్తి చేసుకుని 43 వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం ఎంతో సంతోషదాయకం అని మంత్రి కొల్లు రవీంద్ర సతి మణి కొల్లు ఫౌండేషన్ చైర్మన్ కొల్లు నీలిమ అన్నారు.టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మహానేత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" పాటను ఆలపించారు.అనంతరం నీలిమ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 43 ఏళ్లుగా ప్రజాసేవనే లక్ష్యంగా ముందుకు సాగుతూ, రాష్ట్ర అభివఅద్ధికి ఎనలేని కఅషి చేస్తున్న పార్టీ టిడిపి అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, పార్టీ బలోపేతానికి చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివన్నారు.నందమూరి తారక రామారావు ఆశయాలను కొనసాగిస్తూ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టీడీపీ భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందన్నారు.

# విశ్వావసు అంటే






తెలుగు సంవత్సరాలలో 39వదైన 'విశ్వావసు నామ' సంవత్సరంలోకి అడుగుపెట్టాం. ఈ పేరు 'విశ్వంవసు' అనే రెండు పదాల కలయిక. 'విశ్వం వాసయతి'... అంటే 'విశ్వానికి నివాసాన్ని కలిగించినవాడు, భగవంతుడు' అని అర్థం. "ఈ పేరు మహా విష్ణువుకు కూడా వర్తిస్తుంది. శుభకారకుడైన శ్రీహరి పేరిట ఉన్న ఈ ఏడాది అందరికీ సంతోషాన్ని కలిగించి, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుంది.

సర్వత్ర జాయతే క్షేమం సర్వ సస్య మహార్ఘతా
విశ్వావసౌ వరారోహే కార్పాసస్య మహార్ఘతా...

విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ అన్నింటా క్షేమం కలుగుతుంది. పాడి పంటలు బాగుంటాయి. ప్రత్యేకించి పత్తిపంటలు బాగా పండుతాయి" అనేది పంచాంగకర్తల నిర్వచనం.

కాగా ఇది ఏకాదశ గంధర్వ గణాలలో ఒకరైన గంధర్వుడి పేరని కూడా అంటారు. ఈ పేరు వేదాలలో కూడా కనిపిస్తుంది. "అతను సంపదను ప్రసాదించేవాడు, వివాహ సమయంలో నూతన వధూవరుల మధ్య అనురాగం ఏర్పడి, అది దినదిన ప్రవర్ధమానమయ్యేలా చేసేవాడు" అని కూడా పండితులు చెబుతున్నారు.

సంవత్సరాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయి?

సంవత్సరాల పేర్ల వెనుక ఆసక్తికరమైన పురాణగాథ ఒకటి ఉంది. ఒకసారి వైకుంఠానికి నారదుడు వచ్చి, మహా విష్ణువును దర్శించుకున్నాడు. వారి మధ్య విష్ణు లీలల ప్రస్తావన వచ్చింది. ఆ లీలలు, మాయల ప్రభావానికి ఎవరైనా లోనవుతారేమో కానీ... అవి తనపై పని చెయ్యవని నారదుడు అన్నాడు. విష్ణువు నవ్వి "సరే నారదా!" అని భూలోకంలోని ఒక అడవిలో ఉన్న సెలయేరును నారదుడికి చూపిస్తూ... "వెళ్ళి దానిలో స్నానం చెయ్యి" అని చెప్పాడు.

నారదుడు ఆ సెలయేరులో స్నానం చేయగానే స్త్రీగా మారిపోయాడు. తన గతాన్ని పూర్తిగా మరచిపోయాడు. ఏదీ అర్థం కాని స్థితిలో అటూ ఇటూ తిరుగుతూ ఉండగా... వేట కోసం అడవికి వచ్చిన ఒక రాజు... స్త్రీ రూపంలో ఉన్న నారదుణ్ణి చూసి మోహించాడు. ఆమెను ఒప్పించి వివాహం చేసుకున్నాడు. వారికి అరవైమంది కుమారులు కలిగారు. వారు పెరిగి పెద్దవారయ్యాక... వేరొక రాజ్యంతో యుద్ధం సంభవించింది. ఆ యుద్ధంలో రాజు, ఆ అరవై మంది కుమారులు మరణించారు. ఇది తెలుసుకున్న రాణి (స్త్రీరూపంలో ఉన్న నారదుడు) రోదిస్తూ, మహా విష్ణువును ప్రార్థించింది. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై... "నారదా! నువ్వు ఎవరనేది నీకు ఇంకా గుర్తుకురాలేదా?" అన్నాడు. తక్షణమే నారదుడు తన పూర్వరూపంలోకి మారిపోయాడు. అతనికి జరిగినదంతా గుర్తుకు వచ్చింది. సిగ్గుతో తల వంచుకుంటూ "దేవా! నాపై ఎలాంటి లీలలు, మాయలు పని చేయవని అన్నందుకు... నాకు గొప్ప గుణపాఠం నేర్పారు. కానీ బ్రహ్మచారినైన నేను... స్త్రీగా మారి, మాతృత్వాన్ని చవి చూశాను. ఇప్పుడు ఆ కుమారుల మరణాన్ని భరించలేకపోతున్నాను. వారి జ్ఞాపకం శాశ్వతంగా నిలిచేలా చెయ్యి" అని కోరాడు. "ఆ అరవై మంది పేర్లు... అరవై సంవత్సర నామాలుగా... చిరస్థాయిగా నిలిపోతాయి" అని శ్రీహరి వరం ఇచ్చాడు. ప్రభవ నుంచి అక్షయ వరకూ... అరవై నెలలను వారి పేర్లతోనే పిలుస్తున్నారు. ఈ అరవై పూర్తయిన తరువాత... మరోసారి ప్రభవతో సంవత్సరాల చక్రం పునఃప్రారంభమవుతుంది.

సుఖ సౌఖ్యప్రదాయకం...

ఉగాది పచ్చడి

ఉగాది అనగానే గుర్తుకువచ్చేది.... ఆరు రుచుల సమ్మేళమైన పచ్చడి. దీని విశిష్టతను, ప్రధానంగా వినియోగించే పదార్థాలను 'ధర్మ సింధు' గ్రంథంలోని ఈ శ్లోకం వివరించింది. అబ్దాదౌ నింబకుసుమం... శర్కరామ్ల ఘృతైర్యుతమ్

భక్షితం పూర్వయామేస్యా... తద్వర్షం సౌఖ్యదాయకమ్

"ఉగాదినాడు వేపపూత, బెల్లం (పంచదార), చింతపండు, నెయ్యితో కూడిన పచ్చడిని తింటే... రాబోయే సంవత్సరం సౌఖ్యదాయకంగా సాగుతుంది" అని అర్థం.

అలాగే ఉగాది పచ్చడి తింటున్నప్పుడు...

శతాయుష్యం వజ్రదేహం దదాత్యర్థం సుఖానిచ

సర్వారిష్టవినాశంచ నింబకందళ భక్షణమ్... అనే శ్లోకాన్ని పఠించాలి. వేపపూతను కలిపిన ఉగాది పచ్చడిని తినడం వల్ల శరీరం వజ్రంలా దృఢంగా మారుతుందనీ, అరిష్టాలన్నీ తొలగిపోతాయనీ, వంద సంవత్సరాలు సుఖ సంతోషాలతో జీవిస్తారని ఈ శ్లోకం చెబుతోంది.

హిందూ సంప్రదాయం ప్రకారం... ఈ 'విశ్వావసు నామ' సంవత్సరాది నాటికి కలియుగం ప్రారంభమై 5,126 సంవత్సరాలు గడిచాయి. ఈ ఉగాది రోజున 5,127వ సంవత్సరం ప్రారంభమవుతుంది.

# ఎమ్మెల్యే చొరవతో ప్రారంభమైన ఆస్పత్రి నిర్మాణ పనులు ..



ముధోల్ :అమృత్ తెలంగాణ: నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో గత రెండు సంవత్సరాలపైగా నిలిచిపోయిన ముప్పై పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను ఎట్టకేలకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చొరవతో ప్రారంభం అయ్యాయి. ముధోల్ పాత ఆస్పత్రి శిథిలావస్థకు చేరింది.దీంతో కేవలం గత కొన్ని సంవత్సరాలుగా నామమాత్రపు వైద్య సేవలు అందుతున్నాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గత ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రేడ్డి ముధోల్ ఆస్పత్రిని అప్ గ్రేడ్ చేసి వైద్యవిధాన్ పరిషత్ లో చేర్పించారు. అంతే గాకుండా ముధోల్లో గతంలోనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు చేతుల మీదిగా ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు. దీంతో స్థలం అందరికీ అందుబాటులో ఉండాలని స్థానిక నయబాది ఎక్స్ రోడ్ సమీపంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం భూమిలో కొంత భూమిని ఆస్పత్రి భవన నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించింది. దీంతో గతంలోని ఆసుపత్రి భవన నిర్మాణ పనులు టెండర్ ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్ బేస్మెంట్ వరకు పనులను చెప్పట్టారు. అయితే గత ప్రభుత్వం కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించకపోవటంతో నిర్మాణం పనులను నిలిపివేశారు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. దీంతో ఎమ్మెల్యే కూడా మారిపోయాడు. ఆ పనుల గురించి ఎవరు పట్టించుకోలేదు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోని సంబందిత కాంట్రాక్టర్ ను ఒప్పించారు. ఆస్పత్రి భవన నిర్మాణ పనులు వారం రోజుల నుంచి కొనసాగుతున్నాయి. ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, సంబంధిత అధికారుల, దృష్టికి ఎమ్మెల్యే తీసుకేళ్ళారు. బిల్లుల విషయంలో తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇప్పిస్తానని ఎమ్మెల్యే చెప్పటంతో పనులు ప్రారంభం కావటంతో స్థానికులు హర్ష వ్యక్తం చేస్తున్నారు. గత కోన్నిసంవత్సరం లు గా పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షంగా మారింది. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వైద్యంకు పెద్ద పీట వేస్తానాని ఎన్నికల్లో హామినిచ్చారు. దీంతో వైద్య సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారు. ఏది ఏమైనా ఎమ్మెల్యే చొరవతో ఆస్పత్రి భవన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభంకావటం ప్రాదాన్యతను సంతరించుకుంది.

## కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పిస్తాం..

జన్నారం : అమృత్ తెలంగాణ:జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జిల్లా న్యాక్ ( నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ ) ద్వారా నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వారందరికీ ఉపాధి కల్పిస్తామని మహిళలు ఎవరు అధైర్యపడవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వేడమ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన 27 మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు వారి కుటుంబంలోని మహిళలకు ఉచితంగా అందించామన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలు వారి కుటుంబంలో ఉన్న మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుట్టు మిషన్ నేర్చుకున్న మహిళలందరికీ ప్రభుత్వ పాఠశాల, హాస్టల్లో విద్యార్థులకు దుస్తులు కుట్టడానికి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు మహిళలు ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమర్ షరీఫ్ మంచిర్యాల జిల్లా లేబర్ అధికారి కెవిఎస్ రామ్మోహన్, జిల్లా సహాయక కార్మిక కమిషనర్ ఎం సురేంద్ర కుమార్ హాయకులు నాగేంద్ర, భవన నిర్మాణ కార్మిక సంఘం జన్నారం మండల అధ్యక్షుడు ముల్కల ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, పిఎసిఎస్ చైర్మన్ అల్లం రవి, సుభాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజశేఖర్, నందు నాయక్, ఏ వి ఆర్ ఇసాక్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ మాణిక్యం, ఇందయా రమేష్, షాకీర్, వివిధ గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మిక కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

# తెలుగు అమ్మాయిని టాలెంట్ గుర్తించాల్సిందే..!



టాలీవుడ్ లో సైడ్ రోల్స్ తో పాటుగా చిన్న సినిమాల్లో హీరోయిన్ గా చేస్తూ మెప్పిస్తున్న భామ పూజిత పొన్నాడ. తెలుగు అమ్మాయి అయిన పూజిత రంగస్థలం లో ఆది పినిశెట్టి లవర్ గా కనిపించి అలరించింది. అందం అభినయం ఉన్నా సరే అమ్మడికి లక్ కలిసి రావట్లేదు. ఆమె చేస్తున్న సినిమాలేవి ఆడియన్స్ కి పెద్దగా రిజిస్టర్ అవ్వట్లేదు. వచ్చిన అర కొర అవకాశాలనే చేస్తూ కెరీర్ వెళ్లదీస్తుంది అమ్మడు. సినిమాల కన్నా ఫోటో షూట్స్ తో ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుంది పూజిత. అందుకే అమ్మడి సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా ఎక్కువగానే ఉన్నారు. తరచూ తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని అలరిస్తుంది పూజిత. అయితే తన గ్లామర్ సైడ్ కన్నా తన క్యూట్ లుక్స్ తో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు బీచ్ లో శారీ లుక్ లో ఫోటో షూట్ చేసింది. అది చూసిన కుర్రాళ్లు పూజిత నా హృదయ దేవత నువ్వే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ కలర్ శారీలో వావ్ అనిపించేలా అమ్మడి అందాలు కేక పెట్టిస్తున్నాయి. సరైన ఛాన్స్ వస్తే చాలు తన టాలెంట్ ఏంటో చూపించాలని చూస్తున్న పూజిత పొన్నాడకి అలాంటి అవకాశం రావట్లేదని చెప్పొచ్చు. లాస్ట్ ఇయర్ ఓదెల రైల్వేస్టేషన్ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించిన పూజిత ఆకాశ వీధుల్లో అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ప్రస్తుతం రవితేజ రావణాసుర తో పాటుగా తమిళంలో భగవాన్ సినిమా చేస్తుంది పూజిత. తెలుగు అమ్మాయి కదా గ్లామర్ విషయంలో అడ్డు చెబుతుందేమో అనుకుంటే తను చేస్తున్న సినిమాల్లో లిప్ లాక్స్ ఇస్తూ ఫుల్ కోపరేట్ చేస్తుంది పూజిత. అలాంటిది స్టార్ ఛాన్స్ వస్తే రెచ్చిపోకుండా ఉంటుందా చెప్పండి. కానీ అలాంటి ఛాన్స్ ఒకటి ఇచ్చి ఆమెను ఎంకరేజ్ చేస్తే మాత్రం పూజిత నెక్స్ట్ లెవల్ లో ఉంటుంది.

# 'పౌజీ' కోసం వాళ్లిద్దరి మధ్యా పోటీ!






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ పౌజీ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. 1800 ఏళ్ల కాలం నాటి పీరియాడిక్ స్టోరీలో అద్భుతమైన లవ్ స్టోరీని ఆవిష్కరి స్తున్నాడు. ఇందులో అందమైన ప్రేమ కథతో పాటు అంతకు మించి కళ్లు చెదిరే భారీ యాక్షన్ ఎపిసోడ్లు కూడా ఉంటున్నాయి. ఇందులో డార్లింగ్ కి ప్రభాస్ కి జోడీగా ఇమ్మాన్వీని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే లాంచింగ్ రోజే అమ్మడు అభిమానుల మనసులు దొచేసింది. తన అందచందాలతో నెట్టింట సంచల నమైంది. అటుపై డాన్సులో తానెంత ప్రోఫెషనల్ అన్నది ఓ వీడియో ద్వారా అర్దమైంది. అంతటి ట్యాలెం టెడ్ బ్యూటీ ఇంతకాలం ఎక్కడ ఉంది? అనే చర్చకు తెరి తీసిందంటే? ఇమాన్వీ పై ఏ రేంజ్ లో హైప్ వచ్చిందో అర్దమవుతుంది. ఇమాన్వీలో ఇవన్నీ చూసే హను ఛాన్స్ ఇచ్చాడన్నది అంతే వాస్తవం. కంటెంట్ లో ఏది బెస్ట్ అంటే..? అయితే ఇందులో సెకెండ్ లీడ్ కూడా ఒకటుంది. ఆ పాత్ర కోసం ఇప్పటికే మృణాల్ ఠాకూర్ ను పరి శీలిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కానీ మృణాల్ నటిస్తే ఫ్రెష్ ఫీల్ రాదు ? అన్న ఆలోచనలోనూ హను ఉన్నాడుట. ఈ నేపథ్యంలోప్రత్యామ్నాయంగా బాలీవుడ్ బ్యూటీ దిశాపటానీని పరిశీలిస్తున్నారుట. కల్కి 2898 లో దిశా నటించిన సంగతి తెలిసిందే. తెరపై కనిపించింది కాసేపే అయినా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేసింది. ఈ నేపథ్యంలో మృణాల్ కంటే దిశా పటానీ అయితే బాగుంటుందని మేకర్స్ భావిస్తున్నారుట. అయితే ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీంతో మృణాల్-దిశా పటానీ మధ్య ఛాన్స్ విషయంలో పోటీ కనిపిస్తుంది. మృణాల్ ఠాకూరు కూడా ఇప్పటి వరకూ ప్రభాస్ తో నటించే ఛాన్స్ రాలేదు. అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తోంది. ఇప్పుడా ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారుతున్నట్లు కనిపిస్తుంది.

# శ్రీలంక తీరంలో బికినీ బ్యూటీ వేషాలు

ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. గోవా టూరిజం అంతకంతకు దిగజారుతోందని నివేదికలు ఉన్నా .. లక్ష్యద్వీప్ టూరిజాన్ని డెవలప్ చేయాలని ప్రభుత్వం పూనుకున్నా.. మాల్దీవులకు డిమాండ్ తగ్గలేదు. ఒంటరి దీవుల్లో చిల్ అయ్యేందుకు తారలు ఆసక్తిగా ఉన్నారు. అయితే ఇతరులకు భిన్నంగా నేహా శర్మ ఇటీవల శ్రీలంక తీరంలో తళుక్కున మెరిపించింది. బ్లాక్ మోనోకినిలో హృదయాలను కొల్లగొట్టింది. బీచ్ లో అందమైన భంగిమలతో నేహా శర్మ చెలరేగిపోయింది. నేహా ఫిట్‌నెస్ ఫ్రీక్ అన్న సంగతి తెలిసిందే. జిమ్‌లు స్టూడియోల వెలుపల ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పుడు కూడా జిమ్ లో కసరత్తులు చేసాకే ఇలా బీచ్ లో ప్రత్యక్షమైంది. ప్రస్తుతం ఈ ఫోటోలను యువతరం వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఈసారి సీక్వెల్‌లో చించేద్దాం! కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నేహా చివరిగా విజయ్ దేవరకొండఫ్యామిలీ స్టార్‌లో అతిథి పాత్రలో కనిపించింది. కానీ ఈ సినిమా ఫ్లాపైన సంగతి తెలిసిందే. టాలీవుడ్ బాలీవుడ్ లో కొన్ని పెద్ద సినిమాల్లో నటించినా కానీ నేహా శర్మ ఫేట్ మారలేదు. కాంపిటీషన్ లో ఈ భామ వెనకబడింది. నేటితరం చిల్లింగ్ గాళ్స్ రేసులో దూసుకుపోతున్నా, నేహా కేవలం మోడలింగ్ అసైన్ మెంట్స్ ఇన్ స్టా పోస్టులకు పరిమితమైంది. హేరాఫేరి 3 లో నటిస్తోందని కబురందినా కానీ ఈ సినిమా తాజా అప్ డేట్ అందలేదు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# వీరమల్లుతో అందాల భామ.. అంతా సిద్ధం..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో వస్తున్న భారీ బడ్జెట్ మూవీ హరి హర వీరమల్లు సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సినిమాలో ఇప్పటికే నిధి అగర్వాల్ జాక్వెలిన్ లాంటి అందాల భామలు నటిస్తుండగా మరో అందాల భామ నోరా ఫతేహి కూడా భాగం అవుతుందని తెలుస్తుంది. బాహుబలి సినిమాలో ఇరుక్కుపో సాంగ్ తో పాపులర్ అయిన నోరా ఓ పక్క బాలీవుడ్ సినిమాలతో బిజీ బిజీగా ఉంటుంది. అయితే సౌత్ నుంచి ముఖ్యంగా టాలీవుడ్ నుంచి ఏ చిన్న ఛాన్స్ వచ్చినా సరే కాదనకుండా చేస్తుంది అమ్మడు. పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు సినిమా లో కూడా నోరా ఫతేహి రిజిస్టర్ అయ్యే రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. ఈ నెల చివరన మొదలయ్యే షెడ్యూల్ లో నోరా పాల్గొంటుందని తెలుస్తుంది. ఆమెతో కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్ లో షూట్ చేస్తారని తెలుస్తుంది. వీరమల్లు సినిమాలో తన పాత్రతో మరోసారి తెలుగు ఆడియన్స్ ని అలరించనుంది నోరా ఫతేహి. వచ్చిన ప్రతి ఛాన్స్ వదలకుండా చేస్తూ వస్తుంది నోరా. అందాల భామ బాలీవుడ్ సినిమాల్లో ఎక్కువగా స్పెషల్ సాంగ్స్ లో అలరిస్తుంది. తెలుగులో కూడా అలాంటి ఛాన్స్ లే వస్తుండటంతో ఇక్కడ కూడా తన టాలెంట్ చూపిస్తుంది. ఇక వీరమల్లు లాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ లో నటించడం ఆమె కెరీర్ గ్రోత్ కి హెల్ప్ చేస్తుందని చెప్పొచ్చు. హరి హర వీరమల్లు సినిమా క్రిష్ ఎంతో అద్భుతంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. సినిమాలో ఫ్యాన్స్ అంతా సరికొత్త పవన్ కళ్యాణ్ ని చూస్తారని తెలుస్తుంది. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాకు మ్యూజిక్ కూడా మరో హైలెట్ అయ్యేలా జాగ్రత్త వహిస్తున్నారని తెలుస్తుంది. కొన్నాళ్లుగా షూటింగ్ వాయిదా పడుతుండగా ఈసారి పవన్ సినిమా పూర్తి చేసేందుకు పూర్తి డేట్స్ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ సినిమా పవర్ స్టార్ ఫ్యాన్స్ అందరిని మెప్పించేలా చేస్తుందని అంటున్నారు. ఈ సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న ఈ సినిమా సమ్మర్ కి కుదరకపోతే దసరాకి వాయిదా వేసే ఛాన్స్ ఉందని టాక్.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com